

ఉన్నత విద్య అందరికీ అందాలి

ఏ ప్రభుత్వమైనా ఉన్నత విద్యను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కొత్తగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయించింది. కేంద్ర ప్రభుత్వం ఆ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను కేటాయించింది. అయితే ఆ సీట్లను రాష్ట్ర ప్రభుత్వం వద్దనడం చాలా దారుణం. 'నీట్'లో మంచి ర్యాంకులు సాధించిన ఎంతో మంది ఆశలు అడియాసలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వ కళాశాలల నిర్వహణను చేపట్టాలి.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, అమడగూరు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో పేదలకు మేలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీలలో అయితే ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించాలి. ప్రభుత్వం ఒకసారి పేద, మధ్య తరగతి వర్గాల వైపు నుంచి ఆలోచించాలి. వారికీ ఉన్నత విద్యను అందుబాటులోకి తేవడం కోసం మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న కాలేజీలను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

– ఆకులేటి రమేష్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ధర్మవరం



క్లుప్తంగా

పద్మనాభస్వామి వ్రతం



అలంకరణలో అనంత పద్మనాభస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలోని పూజారి స్వగృహంలో ఆర్యవైశ్యులు, భక్తులు మంగళవారం అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పూలు, ఆభరణాలు, వస్త్రాలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, యమునా పూజలతో పాటు పద్మనాభస్వామి వ్రతాం చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం జానకంపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటలక్ష్మమ్మ తదితరులు మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆది తదితరులు పాల్గొన్నారు.

కాపరికి పరిహారం అందజేత

కనగానపల్లి: వేపకుంటకు చెందిన గొర్రెల కాపరి ఈశ్వరయ్యకు అటవీశాఖ అధికారులు రూ.36 వేల పరిహారాన్ని అందజేశారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాలు.. గతేడాది జూలై 14న వేపకుంట సమీపంలోని పుట్ట కనుమ ఫారెస్టులో ఈశ్వరయ్య తన గొర్రెలను మేపుతున్నాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన చిరుత పులి గొర్రెల మందపై దాడి చేసి 9 గొర్రె పిల్లలను చంపేసింది. బాధితుని ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు ప్రభుత్వం నుంచి పరిహారాన్ని మంజూరు చేయించారు. దీనిని మంగళవారం పెనుకొండ సబ్‌డివిజన్ అటవీశాఖ అధికారులు బాధితునికి అందజేశారు. డివిజనల్ ఫారెస్టు రేంజ్ అధికారులు శ్రీనివాసరెడ్డి, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన డ్రైవర్ బాబ్‌జాన్

తనకల్లు: చీకటిమానిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ బాబ్‌జాన్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి..తిరుపతికి చెందిన బాబ్‌జాన్ అంబులెన్స్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం తెల్లవారుజాయున తిరుపతి నుంచి అంబులెన్స్‌లో మృతదేహాన్ని కొక్కంటిక్రాస్‌కు తీసుకొచ్చాడు. తిరుగు ప్రయాణంలో చీకటిమానిపల్లి దగ్గరకు రాగానే గుర్తు తెలియని వాహనం అంబులెన్స్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబ్‌జాన్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో క్షతగాత్రుని మదనపల్లి ఆస్పత్రికి తరలించారు.

ఉత్తమ టీచర్‌కు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం ఇసాక్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. మంగళవారం కొత్తచెరువు మండలం బండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన మాణిక్యం ఇసాక్‌కు ప్రదానోపాధ్యాయుడు వెంకటరమణతోపాటు తెలుగు ఉపాధ్యాయులు పూలమాల శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వేశ్వర్‌రావ్, జనార్దన, హరిప్రసాద్, నాగరాజమ్మ, అనంతలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లొద్దు

బత్తలపల్లి: ఫ్యాక్షన్ గొడవల జోలికి వెళ్లి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి యర్రాయపల్లిని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి ఆయన గ్రామసభ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పాత కక్షలు మనసులో ఉంచుకుని గొడవలు, బెదిరింపులకు దిగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ



ఎస్పీకి మొక్క అందజేస్తునన డీఎస్పీ

పుట్టపర్తి టౌన్: కదిరి నూతన డీఎస్పీ శివన్నారాయణస్వామి మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని డీఎస్పీకి సూచించారు.

జ్వరాల ముప్పేట దాడి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ధర్మవరం రూరల్: వర్షాకాలం వ్యాధుల సీజన్. ధర్మవరం నియోజకవర్గంలో ప్రస్తుతం జ్వరాలు ముప్పేట దాడి చేస్తున్నాయి. వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం దోమలు. ఇళ్ల పరిసరాల్లో మురుగు గుంటలు, నీటి కుండీలు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, మట్టి, ప్లాస్టిక్ పాత్రలు ఇతర ఖాళీ వస్తువులు, టైర్లలో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు వాటిలో చేరి గుడ్లు పెట్టే అవకాశం ఉంది. దోమల లార్వా వేగంగా వృద్ధి చెందుతుంది. వీటి వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గన్యా వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వాతావరణ మార్పులతో అతిసారం వంటి వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెపుతున్నారు. జ్వరం వచ్చి ఇబ్బంది పడేకంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మేలని అంటున్నారు.

సీజనల్ వ్యాధుల లక్షణాలు...

■ **టైఫాయిడ్**

జ్వరం అధికంగా ఉండి తగ్గకపోవడం, విపరీతమైన చెమట, విరేచనాలు, కడుపునొప్పి, అలసట, ఆకలి లేకపోవడం, మలబద్ధకం, చర్మంపై దద్దుర్లు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది సాల్మోనెల్లా టైపి బ్యాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.



ఓబుళనాయనపల్లిలో సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



గొట్లూరులో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

■ **చికున్ గన్యా**

దోమకాటు వల్ల చికున్‌గన్యా వ్యాధి వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు లక్షణాలు. ఇది సోకితే మొదటి రెండు మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది. వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది.

■ **డెంగీ**

వైరల్ జ్వరం మాదిరి హఠాత్తుగా జ్వరం వస్తుంది. తీవ్రమైన ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఎముకలు విరిగిపోతున్నంత బాధ కలుగుతుంది. పొట్ట, కాళ్లు, చేతులు, ముఖం, వీపు భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది. ఈడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వల్ల డెంగీ వస్తుంది. ఈ దోమ పగటి పూట కుడుతుంది.

ప్రజల భాగస్వామ్యంతోనే నియంత్రణ

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మాస్క్ ధరించడం వల్ల చాలా వరకు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు. చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా నీరు నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– పుష్పలత, దర్శనమల వైద్యాధికారి

■ **మలేరియా**

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా వ్యాధి లక్షణాలు. మలేరియా జ్వరం తగ్గిన తర్వాత కూడా మళ్లీ వస్తుంది. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. మలేరియా ఆడ అనాఫిలస్ దోమ కాటు కారణంగా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి.

వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



విశ్వకర్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

ప్రశాంతి నిలయం: విభిన్న చేతివృత్తులకు ఆద్యుడైన దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని, చేతి, కుల వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితోపాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణుడు పాలించిన ద్వారక నగరాన్ని, పాండువల కోసం ఇంద్రప్రస్థ రాజభవనం నిర్మించడంతో పాటు దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను విశ్వకర్మ తయారు చేశారని ప్రతీతి అన్నారు. నేటి చేతివృత్తుల కార్మికులు విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని వృత్తిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి నిర్మలా జ్యోతి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాలాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి, విశ్వరూపాచార్యులు నాగభూషణ ఆచార్యులు, వెనుకబడిన తరగతులు సహాయ సంక్షేమ అధికారులు బాలాజీ, సుబ్బరాయుడు, పీఎం గంగాధర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో నులిపురుగుల నివారణ



బుక్కపట్నం జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థినికి నులిపురుగుల మాత్ర వేస్తున్న రాజేంద్రకుమార్‌రెడ్డి



గాండ్లపెంట గజ్జలచెన్నారెడ్డి పాఠశాలలో మాత్రలు వేస్తున్న హెచ్‌ఈ విజయ్‌కుమార్



కనగానపల్లి విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడిమర్రి/ గాండ్లపెంట/ పుట్టపర్తి: వ్యక్తిగత శుభ్రత పాటిస్తే నులిపురుగుల నివారణ సాధ్యమని పీహెచ్ఎన్ లక్ష్మీదేవి విద్యార్థులకు సూచించారు. తాడిమర్రిలోని వాసవి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఆమె సిబ్బందితో కలసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులు పరిశుభ్రత లేకుండా ఆహారం తీసుకోవడం, అపరిశుభ్రంగా ఉన్న ఆహార పదార్థాలు తినడంతో కడుపులో నులిపురుగులు ఉత్పత్తి అవుతాయన్నారు. దీంతో విద్యార్థుల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం తదితర సమస్యలు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థి గోర్లను కత్తిరించుకుని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా మరుగుదొడ్డి ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో పిద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. 4,464 మంది పిల్లలకు గాను 4,184 మందికి మాత్రలు వేసి 94 శాతం పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- గాండ్లపెంట మండలంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 4,494 మంది విద్యార్థులకు గాను 4434 మందికి ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్‌లు ఉపేంద్రారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- చిన్నారులు నులిపురుగుల నివారణ మందులు వేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం బుక్కపట్నంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్‌చౌదరి, సిబ్బందితో కలిసి నులిపురుగు నివారణ మాత్రలు వేశారు.
- **నల్లచెరువు :** మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 90 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, ఈఓఆర్డీ నసీమ, సర్పంచ్ పంచ రత్నమ్మ, కార్యదర్శి వసుంధర తదితరులు పాల్గొన్నారు.
- **ఎన్పీకుంట:** మండల కేంద్రంలోని కేజీబీవీ, పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగలక్ష్మి, పీహెచ్ఎన్ శాంతమ్మ, ఏఎన్ఎమ్ శంకరమ్మ, ఆశా లక్ష్మీదేవి, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకొంటున్న 98 శాతం మంది విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు.

ధర్మవరం రూరల్: రావులచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ నజీర్, ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పంచాయతీ కార్యదర్శి యల్లప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- కదిరి నూతన ఆర్‌టీఓ శ్రీనివాసులు



కదిరి: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని కదిరి నూతన ఆర్‌టీఓ జె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఎంవీఐ వరప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కదిరిలో తాను మొట్ట మొదటి ఆర్‌టీఓనని, గతంలో ఇక్కడ ఎంవీఐ మాత్రమే ఉండేవారన్నారు. ప్రస్తుతం ఇక్కడ తనతో పాటు ఒక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఒక సీనియర్ అసిస్టెంట్ ఉంటారని తెలియజేశారు. రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిస్తామని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. తరచుగా ప్రమాదాలు జరిగే స్పాట్‌లను గుర్తించి ఆర్‌అండ్‌బీ, పోలీస్ శాఖల సహకారంతో నివారణ చర్యలు చేపడతామన్నారు. కారు డ్రైవ్ చేసే వారితో పాటు అందులో ప్రయాణించే వారు సైతం సీటు బెల్టు ధరించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని, అలాగే అన్ని పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామని ఆర్‌టీఓ తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలకు అతి వేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్‌లో సెల్ ఫోన్‌లో మాట్లాడటం ప్రధాన కారణాలుగా గుర్తించామన్నారు. వాహన డ్రైవర్లు విశ్రాంతి లేకుండా నిరంతరం వాహనం నడపుతూ అలసటతో కనురెప్ప వాల్చడంతో ఘోర రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. లారీలు, బస్సులు ఇలా ఏ వాహనానికైనా వెనుక భాగాన ఎరుపు రంగు రేడియం స్టిక్కర్లు అతికిస్తే రోడ్డు పక్కన వాహనం ఆపినప్పుడు ఆ దారిగుండా వెళ్లే వాహనాలకు వెంటనే అక్కడ వాహనం ఉందన్న విషయం తెలుస్తుందన్నారు.

మైనర్లు డ్రైవ్ చేస్తే రూ.25 వేల జరిమానా

ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక వైపు కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని ఆర్‌టీఓ సూచించారు. హెల్మెట్ ధరించక పోవడంతోనే ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేశారు. వాహనం నడిపే వ్యక్తికి కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. అలా లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే గరిష్టంగా రూ.2వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మైనర్లు డ్రైవ్ చేస్తున్నట్లు గుర్తిస్తే రూ.25 వేల వరకు పెనాల్టీ కట్టాలని, అలాగే ఆ వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కూడా రద్దు చేస్తామని, 25 ఏళ్ల వయసు వచ్చే వరకూ ఆ మైనర్ లైసెన్స్‌కు అనర్హుడవుతారని వివరించారు. తమ వాహనాన్ని ఇతరులకు ఇచ్చేటప్పుడు వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? లేదా అనే విషయం వాహన యజమాని గుర్తించాలన్నారు. ఇలాంటి ప్రమాదాల్లో వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తారనే విషయం అందరూ గ్రహించాలని సూచించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత

పుట్టపర్తి టౌన్:/ బత్తలపల్లి/ గాండ్లపెంట/ తాడిమర్రి/ ధర్మవరం అర్బన్/ పుట్టపర్తి/ తనకల్లు/ పుట్టపర్తి అర్బన్/ ఎన్పీకుంట/ కదిరి అర్బన్/ నల్లచెరువు: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో పరిశుభ్రత సాధ్యమవుతుందని వక్తలు అన్నారు. స్వచ్ఛ పుట్టపర్తిగా మార్చేందుకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం నుంచి స్వచ్ఛతా హి సేవపై ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి విద్యార్థులు, అధికారులు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో డీపీటీఓ మధుసూదన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, సిబ్బందికి అవగాహన కల్పించారు. బస్టాండ్ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రయంలో వైస్ చైర్మన్ తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

- 'స్వచ్ఛతా హీ సేవ-2024' కార్యక్రమాన్ని మంగళవారం బత్తలపల్లి మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, సర్పంచులు, స్థానిక నాయకులతో పాటు విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
- గాండ్లపెంట మండల కేంద్రంలో సర్పంచ్ రహంతుల్లా ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, మండల స్థాయి అధికారులు స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, ఈఓఆర్డీ సునిత, ఎంఈఓ శ్రీనివాసులు, ఎపిఎం సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- తాడిమర్రి, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు, దాడితోట, పెద్దకోట్ల, పిన్నదరి, నార్సింపల్లి తదితర సచివాలయాల్లో మంగళవారం విద్యార్థులతో స్వచ్ఛతా హి సేవపై ర్యాలీ నిర్వహించారు. తాడిమర్రిలో పంచాయతీ కార్యదర్శి రిజ్వానా, సర్పంచ్ బాలమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టపర్తిలో ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, చైర్మన్



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే సిబ్బంది తదితరులు

- ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచడం ద్వారా భావితరాలకు పర్యావరణ పరిరక్షణ అందించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ధర్మవరంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, ఆనంద్, హైమావతి, మీనా, ధనుంజయ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది 'స్వచ్ఛతా హి సేవ'పై ప్రతిజ్ఞ చేశారు.
- బుక్కపట్నంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.
- తనకల్లు మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవపై మంగళవారం అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత, అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం, చెత్త డిబ్బులు లేకుండా చేసి చూడ చక్కని ప్రదేశం చేయడం, చెత్తతో బొమ్మలు తయారు చేయడంతో పాటు విద్యార్థులకు, యువకులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
- పుట్టపర్తి మండలంలోని ప్రతి గ్రామంలోనూ 15 రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలలో స్వచ్ఛతా హీసేవ నిర్వహించారు.
- ఎన్పీకుంట మండలం మండెంవారిపల్లిలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కదిరి మండలం చలమకుంట్లపల్లి పంచాయతీలో మంగళవారం ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.
- నల్లచెరువు మండల వ్యాప్తంగా మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఎంపీడీఓ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేజీబీవీ, జెడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం ర్యాలీ చేశారు.

చెన్నేకొత్తపల్లి: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వక్తలు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా పంచాయతీల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగావతి, ఈవోఆర్డీ అశోక్‌కుమార్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: రేగాటిపల్లిలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ అబ్దుల్ నబి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

పౌష్టికాహారంతో ఎదుగుదల

తనకల్లు: చీకటిమానిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ మంచి పౌష్టికాహారంతోనే శిశువులో మానసిక, శారీరక ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నేషనల్ ఎగ్జిబిషన్ పోటీల్లో తగరకుంట విద్యార్థి

పుట్టపర్తి: ఢిల్లీలో మంగళవారం నుంచి ప్రారంభమైన నేషనల్ ఎగ్జిబిషన్ అండ్ ప్రాజెక్టు పోటీల్లో కనగానపల్లి మండలం తగరకుంట ఉన్నత పాఠశాల విద్యార్థి వంశీకుమార్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడని హెచ్‌ఎం శివయ్య, సిబ్బంది తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపట్టరాదు

ఎన్పీకుంట: పంచాయతీకి సంబంధించిన ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మనోహర్ హెచ్చరించారు. ఎన్పీకుంట గ్రామ పొలం సర్వే నంబరు -294లో పశువుల మందలోని పంచాయతీ స్థలంలో ఇదే గ్రామానికి చెందిన పాలగిరి మహబూబ్‌బాషా రేకులషెడ్డు నిర్మించాడని సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామసర్వేయర్ ఉపేంద్రతో కలిసి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. సంబంధిత వ్యక్తిని పిలిపించి రేకులషెడ్డు తొలగించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

తనకల్లు: ఈతోడు హరిజనవాడలో లక్ష్మీదేవి అనే మహిళ మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స కోసం తనకల్లు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుండి కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.